بِسْمِ اللّٰہِ الرَّحْمٰنِ الرَّحِیْم نَحْمَدُہٗ وَنُصَلِّی عَلٰی رَسُوْلِہِ الْکَرِیْم وَعَلٰی عَبْدِہِ الْمَسِیْحِ الْمَوْعُوْد
لَآ اِلٰہَ اِلَّا اللّٰہُ مُحَمَّدٌ رَّسُوْلُ اللّٰہِ
دفتر مجلس انصار اللہ بھارت
Office Of The Majlis Ansarullah Bharat
Mohallah Ahmadiyya Qadian-143516, Distt.Gurdaspur (Punjab) INDIA

# బదర్ యుద్ధపు ఏర్పాట్లు, పరిస్థితులు, సంఘటనలు, ఆం హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం బాధతప్తముగా చేసిన దుఆల ప్రస్తావన.

**సయ్యదినా హ్రజత్ అమీరుల్ మోమినీన్ హ్రజత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు 30 జూన్ 2023వ తేదిన మస్జిద్ ముబారక్, ఇస్లామాబాద్, లండన్ (యుకే)లో ప్రసంగించిన జుమా ప్రసంగపు సారాంశం.**

أَشْهَدُ أَنْ لَا إِلٰهَ إِلَّا اللهُ وَحْدَهُ لَا شَرِيْكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُوْلُهُ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ. بِسْمِ اللهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ. اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ. الرَّحْمٰنِ الرَّحِيْمِ. مٰلِكِ يَوْمِ الدِّيْنِ. إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ. اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ. صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ.

తష్షహుద్, తవూజ్ మరియు ఫాతిహా అధ్యాయపు పఠనాంతరం హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ఇలా తెలిపారు:

సవాద్ బిన్ ఘజియాకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పట్ల ఉన్నటు వంటి అభిమానం మరియు దానిని వ్యక్తపర్చిన అద్భుత విధానంను గూర్చి గత జుమాలో ప్రస్తావించాను. ఆ ఘటనను గూర్చి మరికొంత వివరముగా ఈ జుమాలో ప్రస్తావించాలను కుంటున్నాను. సవాద్ ఆ యుద్ధంలో విజయ వైభవంతో తిరిగి వచ్చారు. అంతేగాకా అన్యారధులలో ఒకరైన ఖాలిద్ బిన్ హష్షామ్‌ను బంధించుకొని తీసుకవచ్చారు. ఆ తరువాత ఆం హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి రజినే ఖైబర్ యుద్ధంలో సంపధను ఏకం చేయుటకు కోశాధికారిగా నియమించారు.

హ్రజత్ మిర్జా బషీర్ అహ్మద్ రజి గారు ఈ ఘటనను గూర్చి ఈ విధముగా ప్రస్తావించారు. హిజ్రి 2వ సంవత్సరం రమజాన్ మాసపు 17వ తేది మరియు శుక్రవారం రోజున ముందుగా ఫజర్ నమాజ్‌ను చదివినారు. హుజూర్ అక్రం సల్లల్లాహు అలైహి వసల్లం జిహాద్ అంశంపై ఉపన్యసించారు. ఇక పూర్తిగా తెల్లవారిన తరువాత రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక బాణముతో ముసల్మానుల వరుసలను క్రమబద్దీకరించ సాగారు. సవాద్ అనే ఒక అనుచరుడు వరుస కంటే కొంచం ముందుకు వచ్చి నిలబడ్డాడు. ఆం హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ వద్ద ఉన్న బాణంతో వారిని వెనుకకు జరిగి వరుసలో సరిగ్గా నిలబడమని సూచించారు. ఈ క్రమంలో ఆ బాణం అంచు ఆ అనుచరుడి చాతికి తగిలింది. అప్పుడు ఆ అనుచరుడు గొంతును కొంచం పెద్దగా చేసి ఓ రసూలుల్లాహ్! సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ తాలా మిమ్ములను సత్యం మరియు న్యాయబద్ధతతో అవతరింపజేశాడు. కాని మీరు మాత్రం అన్యాయంగా నాకు మీ బాణాన్ని తగిలించారు. దేవుని ప్రమాణం! నేను తప్పకుండా అందుకు ప్రతీకారం తీర్చుకుంటాను అని అన్నాడు. అందుకు ఆం హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఓ సవాద్! సరే మంచిది. నీవు కూడ నీ బాణాన్ని నాకు తగిలించుము అని అన్నారు. ఆ తరువాత ఆం హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ చొక్కాను విప్పారు. మరోవైపు అనుచరులు ఈ సవాద్ ఇలా ఎందుకు

వ్యవహరిస్తున్నాడు అని ఆందోళనకు గురికాసాగారు. ఇంతలోనే సవాద్ రజి ముందకు వచ్చి ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఆలింగనం చేసుకొని, ముద్దు పెట్టాడు. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం చిరునవ్వు నవ్వుతూ ఓ సవాద్! ఇలా చెయ్యాలి అని నీకు ఎందుకు అనిపించింది? అని అడిగారు. అప్పుడు సవాద్ రజి ఓ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం! శత్రువులు ఎదురుగా ఉన్నారు. ఇక్కడి నుండి తిరిగి ఇంటికి వెళ్ళుతామో లేదో తెలియదు. కావున నేను వీరమరణం పొందడానికి ముందు ఒక్కసారి మీ శుభప్రదమైన శరీరాన్ని తాకినచో జన్మధన్యమవుతుందని భావించాను అందుకే ఇలా చేశాను అని దు:ఖం నిండియున్న కంఠంతో సమాధానం ఇచ్చాడు.

మొత్తానికి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వరుసలను సరి చేసిన తరువాత అనుసరులను ఉద్దేశించి ఇలా ఆదేశించారు. నేను మీకు అనుమతిని ఇచ్చేంత వరకు మీకు మీరుగా శత్రువులపై దాడి చేయకూడదు. శత్రువులు మీ సమీపంనకు రాకముందే మీరు మీ ఖడ్గాలను మీ ఖడ్గపు సంచులలో నుండి బయటికి తీయకూడదు. అదే విధముగా హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం యుద్ధంచేయాలని, ఈ క్రమంలో సహనంను పాటించాలని, కష్టాలు ఎక్కువైనప్పుడు సహనంను పాటించినచో అల్లాహ్ తాలా ఆయా కష్టాలను దూరం చేస్తాడు. బాధల నుండి విముక్తిని కల్పిస్తాడు అని తెలిపారు.

మరొక కథనములో ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఈ ఆదేశాలు ప్రసంగం రూపంలో ఈ విధముగా ఉన్నదని వివరముగా పేర్కొనబడింది. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ముందుగా అల్లాహ్ తాలాను స్మరించుకున్నారు. ఆపై ఇలా ప్రసంగించారు: " అల్లాహ్ తాలా మిమ్ములను ఏయే విషయాలలో ప్రోత్సహించాలని తెల్పినాడో ఆయా విషయాలలో నేను మిమ్ములను ప్రోత్సహిస్తున్నాను. ఏయే విషయాలలో అడ్డుకొమ్మని చెప్పాడో ఆయా విషయాలలో నేను మిమ్ములను అడ్డుకుంటున్నాను. మహోన్నతుడు, పవిత్రుడైన అల్లాహ్ తాలా సత్యాన్ని అనుసరించమని మిమ్ములను ఆదేశిస్తున్నాడు. ఎందుకనగా అల్లాహ్ సత్యాన్ని ఇష్టపడుతాడు. సత్కార్యములు చేయువారికి ఉన్నతమైన స్థానాన్ని కల్పిస్తాడు. కష్టాల సమయంలో సహనం పాటించడం వలన అల్లాహ్ తాలా ఆయా కష్టాలను తీర్చుతాడు, బాధలనుండి విముక్తిని కల్పిస్తాడు. సహనంను పాటించడం వలన ప్రళయదినమున కూడ మోక్షాన్ని పొందగలరు. అల్లాహ్ తాలా మరల ఇలా తెల్పుచున్నాడు. మీరు పరస్పరం కోపగించుకునే దానికంటే ఎంతో అధికముగా అల్లాహ్ కోపగించుకోగలడు. కావున అల్లాహు తన ధర్మశాస్త్రములో ఏయే పనులను చేయమని మిమ్ములను ఆదేశించాడో వాటిని నెరవేర్చుటకు ప్రయత్నించుము. ఎందుకనగా అతడు మీకు తన సంకేతాలను చూపించాడు. పైగా మీరు అవమానించబడుతున్నప్పుడు మీకు గౌరవాన్ని కల్పించాడు. కావున అల్లాహు మీ పట్ల ప్రీతిని వ్యక్త పర్చు నంతగా మీరు అతనితో అనుబంధాన్ని పెంచుకోండి. ఇప్పుడున్న సమయంలో అల్లాహ్ మీకు పెట్టే ఈ పరీక్షలో పూర్తి స్థాయిలో నెగ్గండి. ఫలితముగా అతడు మీతో చేసిన వాగ్దానం ప్రకారంగా మీరు అతని దయానుగ్రహాలకు వారసులవుతారు. అతని వాగ్దానం సత్యం. అతని వాక్కు నిజం. అతని శిక్ష చాలా కఠినం. నేను మరియు మీరు అందరం సజీవుడైన, సుస్థిరుడైన ఆ అల్లాహ్ ఆదీనంలోనే ఉన్నాము. కావున మనకు విజయాన్ని చేకూర్చమని అతనినే ప్రార్థించుదాం!. అతనితోనే ముడిపడి ఉందాం!. అతనిపైనే నమ్మకాన్ని పెంచుకుందాం!. చివరికి మనమందరం అతని వైపే తిరిగి వెళ్ళవలసియున్నది. అల్లాహ్ తాలా మనలను మరియు ఇతర ముసల్మానులందరిని క్షమించుగాకా!."

హజ్రత్ ఇబ్నే అబ్బాస్ రజి ఇలా ఉల్లేఖించారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం బదర్ యుద్ధం రోజున అనుచరులతో " బనూ హాషిం మరియు ఇతర మరికొన్ని తెగలవారు బలవంతపెట్టడం వలన ఈ యుద్ధంలో పాల్గొన్నారు కాని, వారు మనతో యుద్ధం చేయడానికి ఏ మాత్రం సిద్ధముగా లేరు అనే విషయం నాకు తెలిసింది. కావున ఈ యుద్ధంలో బనూహాషీం తెగవారిలో ఎవరైన మీకు ఎదురుపడినా, బఖ్తిరి తెగవారిలో ఎవరైన మీకు ఎదురుపడినా, అబ్దుల్ ముత్తలిబ్ కుమారుడైన అబ్బాస్ తెగవారిలో ఎవరైన మీకు ఎదురుపడినా మీరు వారిని హతమార్చకండి. అదే విధముగా మక్కాలో మనం కష్టాలలో ఉన్నప్పుడు అన్యారాధులలో కొందరు మనకు బాసటగా నిలిచి, మనతో మర్యాద పూర్వకముగా

వ్యవహరించారు. అలాంటి వారు కూడ కొందరు శత్రువు సైన్యంలో ఉన్నారు. కావున వారి ఉపకారానికి ఈ రోజు ఋణాన్ని తీర్చుకోవడం మన బాధ్యత. (అనగా వారిని కూడ హతమార్చకుండ వదిలి వేయండి) ఎందుకనగా వారు మక్కాలో ఉన్న ముసల్మానులతో నేటికి మర్యాద పూర్వకముగానే వ్యవహరిస్తున్నారు. అందువలన మీలో ఎవరైన అలాంటి వారిపై ఆధిక్యతను సాధించినచో వారికి ఎలాంటి బాధ కల్గకుండా చూసుకోండి" అని అన్నారు.

అందుకు అబూహుజైఫా రజి మేము మా సోదరులను, బంధువులను చంపుకోవాలి కాని, అబ్బాస్‌ను మాత్రం వదిలి వేయాలా? అని పలికాడు. తరువాత కాలంలో హజ్రత్ అబూ హుజైఫా రజి తాను పలికిన ఈ పలుకులను గుర్తుచుసుకుంటూ చాలా చింతించేవాడు. పైగా తాను పలికిన పలుకులకు వీరమరణం పొందడమే పరిహారం అని భావించసాగాడు. కావున అబూ హుజైఫా యమామ యుద్ధంలో విరోచితముగా పోరాడి వీరమరణంను పొందాడు.

హుజూర్ సల్లల్లాహుఅలైహి వసల్లం ఇలా ఉపదేశించిన తరువాత మరల తమ గుడారంలోకి వెళ్ళిపోయి, దుఆలు, ప్రార్థనలలో మునిగిపోయారు. ఖిబ్లా వైపు ముఖము త్రిప్పుచూ బిగ్గరగా తమ సంరక్షకుడైన అల్లాహ్‌ను పిలిచేవారు. ఈ క్రమంలో హుజూర్ (స) దుప్పటి హుజూర్ (స) భుజాలపై నుండి క్రిందపడిపోయేది. హజ్రత్ అబూబకర్ రజి హుజూర్ (స) సన్నిధికి చేరుకొని , హుజూర్ (స) దుప్పటిని తీసి మరల హుజూర్ (స) భుజాలపై వేసేవారు. ఆ తరువాత హజ్రత్ అబూబకర్ రజి ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంతో " ఓ దైవ ప్రవక్త! మీరు మీ దైవంతో చేసిన ఈ దుఆలు చాలు. అతడు (అల్లాహ్) మీతో చేసిన వాగ్దానాలను తప్పకుండా నెరవేర్చుతాడు" అని విన్నవించుకున్నారు.

శత్రువులు మూకుమ్మడిగా ముసల్మానులపై దాడి చేసినప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎంతో దు:ఖ భరిత కంఠంతో అల్లాహ్ తాలాతో ఈ విధముగా దుఆ చేశారు.

ఓనా అల్లాహ్! నీవు చేసిన వాగ్దానాలను నెరవేర్చుము. ఓ నా యజమాని! ఒకవేళ ముసల్మానుల ఈ చిన్న సమాజం నాశనమైనచో ఈ ప్రపంచంలో నిన్ను ఆరాధించవారు ఎవరు మిగలరు.

ఈ దుఆ చేస్తున్నప్పుడు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎంతగా ఆందోళనకు గురయ్యారు అనగా, ఈ క్రమంలో హుజూర్ (స) కొన్ని సార్లు సజ్దా చేసేవారు, మరికొన్ని సార్లు నిలబడి అల్లాహ్ తాలాను పిలిచేవారు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంకు అవిశ్వాసులపై విజయాన్ని చేకూర్చుతానని అల్లాహ్ తాలా ఖుర్ఆన్‌లో పదే పదే వాగ్దానం చేశాడు. కాని ఎప్పుడైతే బదర్ యుద్ధం అనగా ఇస్లామీయ చరిత్రలో మొదటి యుద్ధం ప్రారంభమైనదో అప్పుడు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఏడ్వడం, దుఆలు చేయడం ప్రారంభించారు. ఏడుస్తున్న క్రమంలో హుజూర్ (స) నోటి నుండి "ఓ నా అల్లాహ్! ఒకవేళ నేడు నీవు 313 మంది ఉన్నటు వంటి ఈ చిన్న సమాజాన్ని నాశనం చేసినచో ప్రళయదినం వరకు ఎవ్వరు కూడ నీకు దాసులు కారు" అనే పదాలు వెలువడ్డాయి.

ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తిరిగి గుడారంలోకి వెళ్ళి దుఆలు చేస్తున్న క్రమంలో హుజూర్ (స)కు కునుకు పట్టింది. ఆ తరువాత ఒక్కసారిగా హుజూర్ (స) మేల్కొన్నారు. ఆపై ఇలా అన్నారు: " ఓ అబూబకర్ ! సంతోషించుము. మీ ఆరాధ్యదైవ సహాయ సహకారములు చేరుకున్నాయి. అటు చూడు! జిబ్రాయిల్ తన గుర్రపు ముక్కు త్రాడును పట్టుకొని దానిని నడిపిస్తూ ఇటు వైపు వస్తున్నాడు. అతని కాళ్ళపై దుమ్ము చిహ్నాలు కూడ ఉన్నాయి."

బదర్ యుద్ధ రంగంలో ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జుబైర్ బిన్ అవామ్ కు కుడివైపు ఉన్న సైన్యానికి సేనాధిపతిగా, మిఖ్దాద్ బిన్ అమర్ ను ఎడమవైపు ఉన్నటు వంటి సైన్యానికి సేనాధిపతిగా, కాలినడక వచ్చే సైన్యానికి ఖైస్‌ను సేనాధిపతిగా నియమించారు. సైనిక బాధ్యతలన్ని హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆధీనంలోనే ఉండేవి. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం కూడ ముందు వరసలోనే

నిలబడి యున్నారు. హజ్రత్ అలీ రజి ఇలా ఉల్లేఖించారు. యుద్ధ రోజున మేము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రక్కన ఉండి పోరాడాము. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం శత్రువులకు చాలా దగ్గరిలో ఉండేవారు. సైనికులందరి కంటే హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎక్కువ వీరోచితముగా పోరాడారు.

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ రజి గారు ఇలా తెలిపారు. ఇరుపక్షాల సైన్యం ఎదరెదురుగా నిలబడినప్పుడు దైవ మహత్యం వలన ఒక అద్భుత దృశ్యం ఇలా కనువిందు చేసింది. అనగా ఆ సమయంలో సైనికులు నిలబడిన స్థితిని చూసినచో ఇస్లామీయ సైనికులు ఖురైష్‌లకు రెట్టింపు సంఖ్యలో కనిపించసాగింది. కాని రెండవ వైపు ఖురైష్‌ల సైన్యం ముసల్మానులకు సంఖ్యాపరంగా చాలా తక్కువగా కనిపించింది. మక్కా నాయకులు ఉమైర్ బిన్ వహబ్‌ను ముసల్మానుల సైనిక బలం ఎంత ఉన్నది?. సరిగ్గా తెలుసుకొని రమ్మని పంపారు. మరోవైపు ముసల్మానుల ప్రతాపం, మహత్యం ఉమైర్‌పై ఎంతగాచూపిందనగా, చివరికి అతడు నిరాశ నిస్పృహలతో తిరిగి వెళ్ళి ఖురైష్‌లను ఉద్దేశించి ఇలా అన్నాడు.

"ఓ ఖురైష్ నాయకులారా! నేను ముసల్మానుల సైన్యంను పరిశీలించి చూడగా నాకు ఆ సైన్యంలో వారి ఒంటెలు తమపై మనుషులను కాకుండా మృతదేహాలను మోసుకొని వచ్చినట్లుగా కనిపించసాగింది. "

ఈ మాటలు వినగానే ఖురైష్‌లు ఆందోళనకు గురై నిరుశ్చాహ పడిపోయారు.

హకీం బిన్ హజామ్ ఈ మాటలు వినగానే ఉత్బా బిన్ రబిఅ వద్దకు చేరుకొని తిరిగి వెళ్ళిపోదాం అని సలహా ఇచ్చాడు. మరోవైపు ఉత్బా కూడ భయభ్రాంతులకు గురైనందున అతడు కూడ ఈ సలహాను అంగీకరించాడు. పైగా హకీంతో మనం మరియు ముసల్మానులు పరస్పరం బంధుమిత్రులం. అలాంటప్పుడు అన్నదమ్ములే ఒకరు మరోకరిపై ఖడ్గాలు దూసుకోవడం బాగుంటుందా?. ముందుగా నీవు అబూ జహల్ వద్దకు వెళ్ళి అతని ముందు కూడ ఈ విషయాన్ని ప్రస్తావించుము అని అన్నాడు. ఈ క్రమంలో హకీం బిన్ హజామ్ అబూజహల్ ముందు ఈ విషయాన్ని ప్రస్తావించగా అతడు వెంటనే మంచిది! మంచిది!! ఇప్పుడు ఉత్బాకు అతని ముందు తన బంధువు మిత్రులు కనిపిస్తున్నారా? అని హేళన చేస్తూ, అగ్ని ఆజ్యం పోసినట్లుగా ఖురైష్ సైన్యపు ఎదలలో శత్రుత్వపు మంటలు ఎగిసిపడే విధముగా అతని ప్రస్తావనను తిరస్కరించాడు. అలా ఆ యుద్ధం చాలా భయంకరముగా కొనసాగింది.

జుమా ప్రసంగం చివరలో హుజూర్ అన్వర్ యుద్ధం ప్రారంభమయ్యే ఘట్టపు మిగితా భాగాన్ని తదుపరి జుమాలో ప్రస్తావించుతాను అని తెలిపారు.

اَلْحَمْدُ لِلّٰهِ ! اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ
اَعْمَالِنَا مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ وَنَشْهَدُ اَنْ لَّا اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ.
عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ اِنَّ اللّٰهَ يَأْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِى الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ يَعِظُكُمْ
لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ۔